నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 9 జనవరి 2025 RANGAREDDY

## హెచ్‌ఎంపీవీ కేసులు లేవు

సిటీబ్యూరో: నగరంలో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైనట్లు వస్తున్న వార్తలు పూర్తి అవాస్తవమని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ వెల్లడించారు. ఒక ప్రైవేటు ల్యాబ్‌లో జరిపిన పరీక్షల్లో 11 మందికి హెచ్‌ఎంపీవీ పాజిటివ్ వచ్చినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై డీహెచ్ స్పందిస్తూ రాష్ట్రంలో తమ రికార్డుల ప్రకారం ఇప్పటి వరకు ఎక్కడా కూడా హెచ్‌ఎంపీవీ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. అనవసరంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, సొమ్ము చేసుకునే క్రమంలో కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లు, దవాఖానలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వీటిని నమ్మవద్దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ముందస్తు చర్యలు చేపట్టామని, గాంధీ, నిలోఫర్ తదితర దవాఖానల్లో ఇప్పటికే ప్రత్యేక వార్డులు సైతం ఏర్పాటు చేసినట్లు డీహెచ్ డా.డాక్టర్ రవీంద్రనాయక్ వెల్లడించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ పెద్ద ప్రమాదకారి కాదని, అయినప్పటికీ ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు.



మెట్రో ప్రయాణికులకు సంక్రాంతి అనుభూతులను అందించడమే లక్ష్యంగా... సంక్రాంతి మెట్రో ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు మెట్రో ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డి తెలిపారు. మరో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మెట్రో సేవలను మరింత మందికి చేరువ చేయడంలో, కమ్యూనిటీలో ప్రయాణికులను కూడా భాగస్వామ్యం చేసే ఉద్దేశంతోనే సంక్రాంతి మెట్రో ఫెస్ట్ చేపట్టినట్లు ఎల్ అండ్ టీ ఎండీ సీఈవో కేవీబీ రెడ్డి తెలిపారు.
-సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ)



ఆమనగల్లు మండలం కాకిబండతండా సమీపంలో తమ పొలాల్లో నుంచి రోడ్డు వేయనిచ్చేది లేదంటూ పంటపొలాల్లో బైఠాయించిన రైతులు

# పచ్చని పొలాల్లో..
# గ్రీన్‌ఫీల్డ్ చిచ్చు..

41 కిలోమీటర్ల రోడ్డుకు 1000ఎకరాల భూ సేకరణ

భూములిచ్చేది లేదని ఎక్కడికక్కడ అడ్డుకుంటున్న రైతులు

ఫోర్త్‌సిటీ కోసం 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఎందుకని నిలదీత

పోలీస్ బందో బస్తు మధ్య సాగుతున్న సర్వే

## రోడ్డు సర్వేను అడ్డుకుంటున్న రైతులు

*గ్రీన్ ఫీల్డ్ రోడ్డు.. జిల్లా రైతుల్లో తీవ్ర కలకలం రేపుతున్నది. 41 కిలోమీటర్ల రోడ్డు కోసం 1,003 ఎకరాలను ప్రభుత్వం లాక్కొంటున్నది. ఫోర్త్‌సిటీ కోసం 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేయడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దౌర్జన్యంగా భూములను తీసుకోవాలని చూస్తుండడంతో రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. కందుకూరు మండలంలోని పంజాగూడ సమీపంలో ఏర్పాటవుతున్న ఫోర్త్‌సిటీ కోసం ప్రభుత్వం రెండు వైపుల నుంచి 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును ప్రతిపాదించింది. కొంగరకలాన్ సమీపంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న ఓఆర్‌ఆర్ నుంచి పంజాగూడ వరకు 20 కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటుకు 449 ఎకరాలు, పంజాగూడ నుంచి ఆకుతోటపల్లి వరకు 21 కిలోమీటర్ల రోడ్డుకు 554 ఎకరాలను రైతుల నుంచి ప్రభుత్వం తీసుకుంటున్నది.*

*- రంగారెడ్డి, జనవరి 8 (నమస్తే తెలంగాణ)*

### ఎక్కడికక్కడ అడ్డుకుంటున్న రైతులు..
### పోలీస్ బందోబస్తు మధ్య సర్వే..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం చేస్తున్న సర్వే నిర్బంధాల మధ్య సాగుతున్నది. మొదటిరోజు కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లిలో నిర్వహించిన సర్వేను రైతులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. దీంతో పోలీస్ బందోబస్తు మధ్య ఓఆర్‌ఆర్ నుంచి పంజాగూడ వరకు రోడ్డు సర్వే పూర్తి చేశారు. గత రెండు రోజుల నుంచి కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో రెండో విడుత సర్వే ప్రారంభం కావడంతో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. బుధవారం ఆమనగల్లు మండలంలోని కాకిబండతండాలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను మూకుమ్మడిగా గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. తమ ప్రాణాలు పోయినా భూమిలిచ్చేది లేదని పంటపొలాల్లో అడ్డుగా కూర్చున్నారు. పోలీసులు, రైతులను ఒప్పించడానికి ప్రయత్నించినప్పటికీ.. వారు ససేమిరా అనడంతో అధికారులు వెనుదిరుగక తప్పలేదు. కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి పరిసరాల్లో మాత్రం చాటుమాటుగా సర్వేను నిర్వహించారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన రైతులు

## డ్రైవరన్నలు పిట్టల్లా రాలుతున్నా..
# పట్టించుకోరా ?

కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు

ఎన్నికల ముందు అడ్డగోలు హామీలతో మోసం

ఏడాది దాటినా.. ఇప్పటికీ చర్చలకు పిలవనీ సర్కార్

దాటవేత ధోరణిలో రవాణా శాఖ మంత్రి

కాంగ్రెస్ సర్కార్‌పై వాహన సంఘాల నాయకుల ఆగ్రహం

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్లు పిట్టల్లా రాలుతుంటే కాంగ్రెస్ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం విచారకరమని వాహన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గద్దెనెక్కినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 80 మందికి పైగా రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారని.. ఒక్క ఆటో డ్రైవర్ చావుపై కూడా సర్కారు మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని.. అధికారంలోకి వచ్చాక డ్రైవర్లను పట్టించుకున్న పాపానపోలేదని బీఆర్‌టీయూ, తెలంగాణ క్యాబ్ అసోసియేషన్, టీఏడీయూ సంఘాల నాయకులు మారయ్య, షేక్ సలావుద్దీన్, సత్తిరెడ్డిలు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తాజాగా ఏటూరు నాగారంలో గిరాకీ లేక ఆటో డ్రైవర్ నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై వాహన సంఘాల నాయకులు స్పందించారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన సర్కార్.. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని మాటిచ్చిందని..కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని విమర్శించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కూడా తొలుత చర్చల పేరిట హడావిడీ చేసినా.. ఇప్పుడు చర్చల ఊసెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వాహన సంఘాల నాయకుల చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం కూడా మంత్రి పొన్నం హామీతో నిలుపుదల చేసినప్పటికీ మంత్రి మాత్రం సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదని వాపోయారు.

**'అతడి పేరు పరశురామ్ గౌడ్. నాచారం ఆటో డ్రైవర్. వివాహమై పదేండ్లు అయింది. ఇద్దరు పిల్లలు. బాబు జైనీల్, పాప పేరు యునతి. ఆటోను నమ్ముకుని జీవనం సాగించాడు. కుటుంబాన్ని పోషించాడు. కాంగ్రెస్ తీసుకొచ్చిన ఉచిత బస్సు స్కీంతో ఆటో గిరాకీ లేకపోవడంతో పరశురామ్‌కు కష్టాలు మొదలయ్యాయి. కుటుంబాన్ని ఎలా పోషించాలో తెలియక సతమతమయ్యాడు. ఓ వైపు ఫైనాన్స్ ఆటో, మరోవైపు ఇల్లు కిరాయి.. అప్పులు ఇవన్నీ అతడిని చుట్టు ముట్టాయి. అనారోగ్యానికి సైతం గురయ్యాడు. కొన్ని రోజులు ఆసుపత్రుల్లో సైతం చికిత్స పొందాడు. ఇక ఆటోను నమ్ముకుంటే బతికే పరిస్థితి కనిపించకపోవడంతో ఏం చెయ్యాలో తెలియక అక్టోబర్ 7న ఉరేసుకుని చనిపోయాడు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇప్పటికీ ఆ కుటుంబానికి రేవంత్ సర్కార్ ఎలాంటి సాయం అందించలేదు.'**

### రవాణా శాఖ మంత్రి స్పందించాలి



డ్రైవర్లపై కక్షనా ?మహాలక్ష్మి పథకం అమలులో నష్టపోతున్న ఆటోడ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చి.. ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందించలేదు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ సర్కారే బాధ్యత వహించాలి. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ సర్కారు విఫలమైంది. ఓ వైపు గిరాకీ లేక.. మరోవైపు ఆన్‌లైన్ ఆధారిత వాహన సేవలతో డ్రైవర్లు పూర్తిగా నష్టపోతున్నారు. ప్రభుత్వం యాప్ తీసుకొస్తానని మాటిచ్చి.. ఇప్పుడు చోద్యం చూస్తుంది. ప్రైవేట్ ఫైనాన్షియర్లు డ్రైవర్లను జలగల్లా పీడిస్తున్నారు. గిరాకీ లేకపోతే వాళ్లు డబ్బులు ఎలా చెల్లిస్తారు? కుటుంబాన్ని ఎలా పోషిస్తారు? రవాణా శాఖ మంత్రి దీనిపై స్పందించాలి.

**- షేక్ సలావుద్దీన్, అధ్యక్షుడు, తెలంగాణ క్యాబ్ అసోసియేషన్**

### సమస్యలు పరిష్కరించకపోతే..



రాష్ట్రంలో మహాలక్ష్మి ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారు. కండ్ల ముందు డ్రైవర్ల దీనస్థితి కనిపిస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదేం పద్ధతి? కనీసం ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని కూడా ఓదార్చిన పాపానపోలేదు. ఆత్మహత్య చేసుకున్న ప్రతీ డ్రైవర్ కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూం అందించాలి. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. అది కూడా నెరవేర్చలేదు. దీనిపై రవాణా శాఖ మంత్రి పొన్నం ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం విడ్డూరం. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

**-వేముల మారయ్య, అధ్యక్షుడు, బీఆర్‌టీయూ ఆటో యూనియన్.**

### ఆటో డ్రైవర్లను ఆదుకోండి



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని మాటిచ్చి ఇప్పటికీ చేయలేదు. గ్యారంటీలో భాగంగా ఏడాదికి రూ.12వేలు కూడా ఇవ్వలేదు. పార్కింగ్ సమస్య, ఇష్టానుసారంగా చలాన్లు విధించడం తదితర కార్యకలాపాలతో విసిగిపోతున్నాం. గత ప్రభుత్వ హయాంలో డ్రైవర్లు తమ సమస్యలను చెప్పుకుంటే సత్వరమే పరిష్కారమయ్యేవి. గతంలో రెండు త్రైమాసిక వాహన పన్నును కేసీఆర్ సర్కార్ రద్దు చేసింది. డ్రైవర్ల కోసం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా తీసుకొచ్చారు. కానీ కాంగ్రెస్ సర్కార్ మాత్రం డ్రైవర్లపై కక్ష సాధిస్తున్నది.

**-సత్తిరెడ్డి, అధ్యక్షుడు, టీఏడీయూ.**

## ఊరెళ్తున్నారా జర జాగ్రత్త!

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): పండుగల సమయంలో ఊళ్లకు వెళ్లే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు. రానున్న సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిఘాతో పాటు రాత్రి సమయాల్లో గస్తీని మరింత పెంచినట్లు సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. జన సంచారం తక్కువగా ఉండే కాలనీలు, బస్తీలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. అయితే ప్రజలు కూడా తమ వంతు జాగ్రత్తలు పాటించాలని సీపీ పలు సూచనలు జారీచేశారు.

## 42,59,940 ఇండ్ల సర్వే

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతుందని, గ్రేటర్ వ్యాప్తంగా 10,70,463 అప్లికేషన్ల సర్వేలో 2570 లాగిన్‌లను క్రియేట్ చేసినట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4,25,9940 ఇండ్ల సర్వేను ఇప్పటి వరకు పూర్తి చేసినట్లు చెప్పారు.





## చేతికందని కల్యాణలక్ష్మి
### మహిళల నిరసన

ఎర్రగడ్డ : కల్యాణలక్ష్మి పథకం కోసం ఏడాది కిందట దరఖాస్తు చేసుకున్నా..కల్యాణలక్ష్మి చెక్కులు నేటికీ చేతికి అందకపోవడంతో మహిళలు నిరసనకు దిగారు. బోరబండ డివిజన్ వీకర్‌సెక్షన్‌లోని బ్రాహ్మణవాడి బస్తీలో బుధవారం జరిగిన ఈ నిరసనకు సీపీఎం మద్దతు పలికింది. ఈ సందర్భంగా సీపీఎం జూబ్లీహిల్స్ సీనియర్ నేత సాయిశేషగిరిరావు మాట్లాడుతూ ఏడాది కిందట కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న బ్రాహ్మణవాడి బస్తీ మహిళలకు ఆర్నెల్ల కిందటే చెక్కులు మంజూరైనట్లు సంబంధిత శాఖ నుంచి సమాచారం అందిందని పేర్కొన్నారు. కానీ నేటి వరకు ఆ చెక్కులు లబ్ధిదారులకు అందకపోవడం విచిత్రంగా ఉన్నదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని విమర్శించారు. తులం బంగారం ఇస్తామన్న హామీ అటుంచి.. గత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకున్న వారికి లక్ష రూపాయల చెక్కు ఇస్తే చాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనలో మోహన్‌రాథోడ్, శివమ్మ, మీరా, గోపాల్, గమ్మిబాయి, సునీత, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

## 'మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దు'

మొయినాబాద్, జనవరి 8 : మొయినాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ తమ గ్రామాలను విలీనం చేయొద్దని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్‌లను ఆయా గ్రామాల ప్రజలు కలిసి వినతి పత్రాలను అందజేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీని ఏర్పాటు చేస్తూ అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిలుకూరు, ఎన్కేపల్లి, సురంగల్, పెద్దమంగళారం, ముర్తుజాగూడ గ్రామాలను విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో తమ గ్రామాలను కలుపడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పల్లెలను గ్రామపంచాయతీలుగానే ఉంచాలని వేడుకున్నారు. వినతి పత్రాలు సమర్పించిన వారిలో గరుగు రాజు, జగన్మోహన్‌రెడ్డి, అశోక్‌యాదవ్, జకరయ్య, రాములు, రమేశ్, రాజు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా

### మంభాపూర్ రోడ్డుపై విద్యార్థులు, గ్రామస్తుల బైఠాయింపు

పెద్దేముల్, జనవరి 8 : సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ధర్నాకు దిగారు. మండల పరిధిలోని జనగాం గ్రామం నుంచి సుమారు 50 మంది విద్యార్థులు నిత్యం మంభాపూర్, తాండూరు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వస్తుంటారు. రెండు రోజులుగా బస్సులు రాకపోవడంతో బుధవారం విద్యార్థులు, గ్రామస్తులు మంభాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్.. సీఎం జిల్లాలో బస్సుల కొరత.. అంటూ నినాదాలు చేశారు. విద్యార్థుల ధర్నాతో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి.. ధర్నా వద్దకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు. బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్, రాజు, గ్రామస్తులు తాండూరు ఆర్టీసీ డీఎం సురేశ్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన డీఎం.. పాఠశాల సమయానికి బస్సును ఏర్పాటు చేస్తామని చెప్పినట్లు బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు.



మంభాపూర్ రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, జనగాం గ్రామస్తులు